సాక్షి రంగారెడ్డి

శనివారం। 10। మే। 2025



వేసవిలో దున్నక..

పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు పాటించాలని ఏఓ వెంకటేశం తెలిపారు. 10లో▸



ప్రజారోగ్యానికి పెద్దపీట

నిరుపేదల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 10లో▸



సేవా దాహం

సామాజిక సేవే లక్ష్యంగా తాండూరులోని మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఫ్యూచర్‌సిటీ రైతులతో సమావేశమైన అధికారులు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ రైతులతో పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం అధికారులు సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు ఆధ్వర్యంలో రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న సర్వే నంబర్ 120, 121లోని రైతులతో మాట్లాడారు. రహదారి నిర్మాణంలో పూర్తిగా భూమి కోల్పోయి, ఎలాంటి ఆధారం లేని రైతు కుటుంబానికి పరిహారంతో పాటు మేజరైన ప్రతి ఒక్కరికీ అదనంగా రూ.5.50 లక్షల చొప్పున పునరావాసం కింద అందుతుందని ప్రతిమాసింగ్ వివరించారు. మిగతా రైతులకు భూసేకరణ ప్రక్రియ ప్రకారం నిర్ణయించిన పరిహారం అందుతుందన్నారు. కేవలం భూమి మొత్తం కోల్పోతూ, ఎలాంటి ఇతర ఆధారం లేని వారికి మాత్రమే అదనపు పరిహారం వర్తిస్తుందని తెలిపారు. అలాంటి వారు ఎవరెవరు ఉన్నారు అని ఆరా తీశారు. వివరాలు అందించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలే లాభదాయకం



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాములు నాయక్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆరుతడి పంటలే అన్నదాతలకు లాభదాయకమని తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మండలంలోని పోల్కంపల్లిలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయం లాభసాటిగానే ఉందన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేసి రైతుల పక్షాన నిలబడిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. అడ్డగోలుగా కృత్రిమ ఎరువులు వినియోగించొద్దని సూచించారు. అవసరం మేరకు రసాయనాలు వినియోగించి, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని పాటించి సుస్థిర ఆదాయాన్ని పొందాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు సునీత, శ్రీనివాస్‌రెడ్డి రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈఓ శ్రవణ్‌కుమార్, సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

డీఈఓ సుశీందర్‌రావు



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ, ఉపాధ్యాయులు

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని డీఈఓ సుశీందర్‌రావు పేర్కొన్నారు. పురపాలిక సంఘం పరిధిలోని తుక్కుగూడ, సర్దార్‌నగర్, మంఖాల్ గ్రామాల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్ష ఫలితాలే నిదర్శనమన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు, ఇతర సామగ్రి అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, మంచి భవిష్యత్‌ను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కస్నానాయక్, హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మరింతగా.. పవర్

ఏటా పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లు



- 2030 నాటికి గ్రేటర్ డిమాండ్ 9,089 మెగావాట్లు
- దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అంచనా
- సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్లు, డీటీఆర్‌ల సామర్థ్యం పెంపు
- అదనపు సబ్‌స్టేషన్లు, లైన్ల విస్తరణకు ప్రతిపాదనలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లా శరవేగంగా విస్తరిస్తోంది. శివారు మున్సిపాలిటీల్లో భారీ బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతోంది. 2024 గరిష్ట విద్యుత్ డిమాండ్ 3,756 మెగావాట్లు నమోదు కాగా, 2025లో 4,352 మెగావాట్లకు చేరుకుంది. అదే 2030 నాటికి అనూహ్యంగా 9,089 మెగావాట్లకు పెరుగుతుందని డిస్కం అంచనా వేసింది. ఆ మేరకు విద్యుత్ లైన్ల విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు 62 లక్షలకుపైగా ఉన్నట్లు అంచనా. మరో ఐదేళ్లలో ఇది 80 లక్షలు దాటే అవకాశం ఉంది. రాబోయే విద్యుత్ డిమాండ్‌ను ఇప్పుడే గుర్తించి, ఆ మేరకు ఏర్పాట్లు చేయడం ద్వారా ఇళ్లలో 24 గంటలు విద్యుత్ వెలుగులు విరజిమ్మొచ్చని డిస్కం భావిస్తోంది. ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 33/11 కేవీ ఫీడర్లు, డీటీఆర్‌లు సామర్థ్యం పెంచుతున్న డిస్కం.. తాజాగా మరికొన్ని అదనపు సబ్‌స్టేషన్లు, లైన్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. వచ్చే రెండేళ్లలో రూ.420 కోట్ల అంచనాతో రంగారెడ్డిజోన్‌లో 34, మెట్రో జోన్‌లో 36, మేడ్చల్ జోన్‌లో 18 చొప్పున మొత్తం 88 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించింది. పనుల్లో నాణ్యత, వేగవంతం కోసం ఇప్పటికే గ్లోబల్ టెండర్లను ఆహ్వానించిన విషయం తెలిసిందే. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సర్కిళ్ల వారీగా పనులను విభజించి, వాటికి టెండర్లు పిలిచి, ముందుకు వచ్చే ఔత్సాహిక కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని భావిస్తోంది.

61 సబ్‌స్టేషన్లలో రికార్డు స్థాయి వృద్ధిరేటు

గ్రేటర్ జిల్లాల్లోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 62 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షలకుపైగా గృహ, 8 లక్షలకుపైగా వాణిజ్య, 50 వేలకుపైగా పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా అదనంగా 2,500 కొత్త కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. కొత్త కనెక్షన్లకు తోడు ప్రతి ఇంట్లోనూ ఏసీ, కూలర్, ఓవెన్, మిక్సీ, వాషింగ్ మిషన్, గ్రీజర్, టీవీ, కంప్యూటర్, ఐరెస్ బాక్స్ సర్వసాధారణమయ్యాయి. ఫలితంగా విద్యుత్ డిమాండ్ వార్షిక పెరుగుదల రేటు ఏటా సగటున 15 నుంచి 25 శాతం పెరుగుతోంది. 61 సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యుత్ వృద్ధిరేటు నమోదైంది. 30 నుంచి 87 శాతం వరకు వృద్ధి రేటు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. వేగంగా పెరుగుతున్న ఈ వృద్ధి రేటును దృష్టిలో ఉంచుకుని డిస్కం ఇంజనీర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా బంజారాహిల్స్, సైబర్ సిటీ, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, హబ్సిగూడ, మేడ్చల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో ఇరవై 33/11 కేవీ సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచారు. వీటిలో 184 పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచారు. 33 కేవీ ఫీడర్లు 69, అదే విధంగా 11 కేవీ ఫీడర్లు 592 ఏర్పాటు చేశారు. కొత్తగా మరో 6,675 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య లేకుండా చూశారు. భవిష్యత్తులో ఆయా ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో డిమాండ్ రానున్నట్లు డిస్కం ఇంజనీర్లు అంచనా వేశారు.

గ్రేటర్‌లో 2030 నాటికి విద్యుత్ వృద్ధి రేటు

సంవత్సరం	మెగావాట్లు
2022	3,158
2023	3,435
2024	3,756
2025	4,352
2026	5,043
2027	5,843
2028	6,770
2029	7,644
2030	9,089

నియంతృత్వంపై ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

- యుద్ధ సమయంలో అందాల పోటీలు అవసరమా ?
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


ఇబ్రహీంపట్నం: ప్రపంచాన్నే గడగడలాడించిన హిట్లర్‌నే తరిమికొట్టిన పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ విధానాలపై ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. హిట్లర్ ఫాసిజంపై నాటి సోవియట్ యూనియన్ ఎర్ర సైన్యం విజయం సాధించి 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలను ఆక్రమించుకోవాలన్న కుట్ర, కుతంత్రాలతో నియంత హిట్లర్ సాగించిన దూకుడుకు ఎర్రజెండా అడ్డుకట్టవేసిందన్నారు. ఒక్కో దేశాన్ని ఆక్రమించుకుంటూ వస్తూ రష్యాను సైతం ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నానికి 1945లో కమ్యూనిస్టు సైన్యం అడ్డుకట్టవేసి సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడుతోందని ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఉగ్రవాద చర్యలను సీపీఎం ఖండిస్తుందన్నారు. పాకిస్తాన్, భారత్ యుద్ధం కొనసాగుతుండగా హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని జాన్‌వెస్లీ అన్నారు. వెంటనే ఈ పోటీలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట ఈనెల 30న వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే ధర్నాలకు సైతం మద్దతు ఉంటుందని తెలిపారు. రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గం చేపట్టే ఆందోళన కార్యక్రమాల్లో సీపీఎం శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామేల్, జగదీశ్, ఈ.నర్సింహ, జగన్, చంద్రమోహన్ తదితరు పాల్గొన్నారు.

ప్రాథమిక విచారణ తర్వాతే ఎఫ్‌ఐఆర్

హైడ్రా ఠాణా విషయంలో కమిషనర్ కీలక నిర్ణయం



- దుర్వినియోగం, బెదిరింపులకు తావులేకుండా చర్యలు
- న్యాయశాఖ ఉత్తర్వుల తర్వాత అధికారికంగా పని మరూ
- అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి 101 వాహనాల పంపిణీ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పోలీసుస్టేషన్ కార్యకలాపాలకు సంబంధించి కమిషనర్ ఏవీ రంగనాథ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. దురుద్దేశాలతో కూడిన, తప్పుడు ఫిర్యాదులకు చెక్ చెప్పడానికి ప్రాథమిక విచారణ (పీఈ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఈ విచారణ పూర్తి చేసి, నేరానికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు లభించిన తర్వాతే హైడ్రా ఠాణాలో కేసు నమోదవుతుంది. ప్రతి ఫిర్యాదును కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి, సిఫార్సు చేసిన తర్వాతే పోలీసుస్టేషన్‌కు చేరుతుంది. హైడ్రా పోలీసుస్టేషన్ డిజిగ్నేటెడ్ కోర్టుకు సంబంధించి న్యాయశాఖ ఉత్తర్వులు జారీ తర్వాత అధికారికంగా పని చేయడం ప్రారంభించనుంది.

కొన్ని ఫిర్యాదుల వెనుక అనేక ఉద్దేశాలు

ప్రభుత్వ భూములు, లే అవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పార్కులు, చెరువులు, కుంటలు, నాలాల కబ్జాలకు సంబంధించిన కేసుల్ని హైడ్రా ఠాణా నమోదు చేయనుంది. వీటితో పాటు నిర్మాణాల కోసం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వంటి వాటిని ధ్వంసం చేసినా పరిగణనలోకి తీసుకుంటోంది. ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ముందుకు వెళ్తున్న హైడ్రా అధికారులు తీవ్రమైన అంశాలు, నకిలీ పత్రాల సృష్టి, ఫోర్జరీ వంటివి గుర్తిస్తున్నారు. ఆయా ఆక్రమణల్ని తొలగించడంతో పాటు బాధ్యులపై స్థానిక ఠాణాల్లో ఫిర్యాదులు చేస్తున్నారు. కాగా.. హైడ్రాకు వస్తున్న ఫిర్యాదుల్లో కొన్ని వ్యక్తిగత విభేదాలు, కక్షసాధింపు చర్యలు, బెదిరింపుల దందాలతో ముడిపడి ఉంటున్నాయి. దీన్ని పరిగణనలోకి తీసుకున్న కమిషనర్ రంగనాథ్ హైడ్రా ఠాణాలో కేసుల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.

అవసరమైతే సుమోటో కేసులు

కబ్జాలు, ప్రజా ఆస్తుల ధ్వంసానికి సంబంధించి ఫిర్యాదు చేయాలని భావించిన వారు నేరుగా హైడ్రా ఠాణాకు వెళ్లినా వెంటనే కేసు నమోదు కాదు. ఆ ఫిర్యాదును జనరల్ డైరీలో (జీడీ) ఎంట్రీ చేసే సిబ్బంది కమిషనర్ దృష్టికి తీసుకురావాల్సి ఉంటుంది. కమిషనర్ సిఫార్సు మేరకు సిబ్బంది విచారణ చేపడతారు. ఫిర్యాదుతో జత చేసిన పత్రాలు, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులతో పాటు ఆయా శాఖలు, విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తారు. ఈ వివరాలతో పీఈ పూర్తి చేసి.. నేరం జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు జోడించి కమిషనర్‌కు నివేదిక ఇస్తారు. ఆపై ఆయన ఆమోదంతో కేసు నమోదవుతుంది. నేరం ఏ సంవత్సరంలో జరిగిందో పరిగణలోకి తీసుకునే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ఐపీసీ, బీఎన్ఎస్ చట్టాల్లో సెక్షన్ల కింద ఆరోపణలు జోడిస్తారు. ఇప్పటికే వేర్వేరు ఠాణాల్లో నమోదైన కేసుల్ని విడతల వారీగా హైడ్రా స్టేషన్‌కు బదిలీ చేయనున్నారు.

- గ్రేటర్‌లోని పలు కేంద్రాల్లో ఆమ్యామ్యాల వ్యవహారం
- అక్రమార్జనే లక్ష్యంగా వాహనాల నమోదు, బదిలీలు, లైసెన్సులు
- గతంలో ఓ ఆర్టీఓపై క్రమశిక్షణ చర్యలు
- అయినా.. యథేచ్ఛగా కొనసాగుతున్న అవినీతి తతంగం



ఆర్టీఏలో 'ఫేక్ అడ్రస్'



నకిలీ చిరునామాలతో రవాణా శాఖ పౌర సేవలు

సాక్షి, సిటీబ్యూరో: వాహన పర్మిట్ బదిలీ కోసం దాని యజమాని నుంచి రూ.40 వేలు వసూలు చేసినట్లు నగరంలోని బండ్లగూడ ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ అధికారిపై కొద్దిరోజుల క్రితం ఫిర్యాదులు రావడంతో.. అతడిని అక్కడి నుంచి రవాణా కమిషనర్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఇలా పర్మిట్ బదిలీయే కాదు.. అడిగినంత సమర్పించుకుంటే ఎలాంటి సర్వీసులైనా ఇక్కడ తేలిగ్గా లభిస్తాయనే ఆరోపణలున్నాయి. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల బదిలీలు, కొత్త బండ్ల నమోదు సహా వివిధ రకాల పౌరసేవలు ఇక్కడ అంగడి సరుకుల్లా అమ్ముడవుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బండ్లగూడ కార్యాలయంలో తప్పుడు చిరునామాలతో వాహన అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడటంలేదు. గతంలో ఇదే వ్యవహారంలో ఇక్కడి ఆర్టీఓపై క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకున్నారు. కాగా.. ఈ అక్రమాల తంతు ఒక్క బండ్లగూడ కార్యాలయంలోనే కాదు.. నగరంలోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో యథేచ్ఛ గా కొనసాగుతున్నట్లు.. 'ఫేక్ అడ్రస్'లకు చిరునామాలుగా మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చిరునామా ఎంతో కీలకం

డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, చిరునామా బదిలీలు, పర్మిట్ బదిలీలు వంటి వివిధ రకాల సేవల్లో వాహనదారుడి అడ్రస్‌ను ఎంతో కీలకంగా పరిగణిస్తారు. తప్పుడు వ్యక్తులు, అసాంఘిక శక్తుల చేతుల్లోకి వాహనాలు వెళ్లకుండా, అలాంటి వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్సులను పొందకుండా నియంత్రించేందుకు కచ్చితమైన అడ్రస్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్, ఓటర్ గుర్తింపు, బ్యాంకు ఖాతా పుస్తకం, వంట గ్యాస్ డాక్యుమెంట్లు, కరెంట్ బిల్లు చెల్లింపు రసీదు తదితర 13 రకాల పత్రాలను చిరునామా ధ్రువీకరణకు ప్రామాణికంగా భావిస్తారు. కాగా.. సదరు వాహనదారు సమర్పించింది నిజమైనవో కాదో నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే పౌర సేవలను అందజేయాలి. కానీ కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో ఎలాంటి నిర్ధారణ లేకుండానే పౌరసేవలను అంగడి సరుకుల్లా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా.. బండ్లగూడ ప్రాంతీయ రవాణా కార్యాలయానికి ప్రతిరోజూ సుమారు 120 లెర్నింగ్ లైసెన్సులను అందజేస్తే వాటిలో కనీసం 40 వరకు తప్పుడు అడ్రస్‌లపై జారీ చేసినవే ఉంటాయని ఆర్టీఏ అధికారి ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. ఇందులో ఇతర రాష్ట్రాలకు చెందినవారివే ఎక్కువగా ఉంటాయన్నారు.

అడ్డుకుంటున్నా ఆగడంలేదు

'వివిధ రకాల పౌరసేవల కోసం వచ్చే వారి అడ్రస్‌లను పరిశీలించినప్పుడు మా కార్యాలయం పరిధిలోకి రానివి, తప్పుడు డాక్యుమెంట్‌లను సమర్పించినవి గుర్తించి అడ్డుకుంటున్నాం. కానీ అలాంటి వ్యక్తులు నగరంలో ఇతర ఆర్టీఏ కార్యాలయాల నుంచి యథేచ్ఛగా తమకు కావాల్సిన సర్వీసులను పొందుతున్నారు' అని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో పని చేసే ఒక అధికారి తెలిపారు. 'ప్రతిరోజూ 100 నుంచి 120 లెర్నింగ్‌లు ఇస్తేనే గిట్టుబాటవుతుందని భావించే సిబ్బంది ఉన్నచోట స్క్రూటినీ చేస్తే కనీసం 30 శాతం తప్పుడు అడ్రస్‌లే నమోదైనట్లు తేలుతుంది' అని మరో అధికారి చెప్పడం గమనార్హం. వాహనదారులు సమర్పించే అడ్రస్ పత్రాలు అసలివో, నకిలీవో నిర్ధారించే వ్యవస్థ లేకపోవడమే దీనికి కారణమని జూబ్లీహిల్స్‌కు చెందిన డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఒకరు అభిప్రాయపడ్డారు.

పూల దారులు



మొయినాబాద్: ఎలుకగూడ రోడ్డు పక్కన విరబూసిన ఎర్రతంగేడు

మండు వేసవి.. భానుడు భగ్గుమంటున్నాడు.. ఎండలు మండిపోతున్నాయి.. నీటి వనరులన్నీ ఎండుముఖం పట్టాయి.. రహదారుల పక్కన చెట్లు మాత్రం అందమైన పూలతో అలరిస్తున్నాయి.. వాహనదారులకు స్వాగతం పలుకుతున్నాయి.. ఎర్ర తంగేడు చెట్లు నిండుగా పూలు పూసి దారిన వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి.

– మొయినాబాద్/మంచాల



మంచాల: మంచాల–చిత్తాపూర్ రోడ్డుకు ఇరువైపులా పూసిన పూలు

హత్యాయత్నం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

శంకర్‌పల్లి: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు ప్రయత్నించిన నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ చేవెళ్ల కోర్టు న్యాయమూర్తి దశరథరామయ్య శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గాజులగూడ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, రాజేందర్‌రెడ్డి మధ్య కొన్నేళ్లుగా ఆర్థిక లావాదేవీలు కొనసాగాయి. ఈ విషయంలో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో దుర్గప్రసాద్‌ను హత్య చేయాలని రాజేందర్‌రెడ్డి భావించాడు. ఈ క్రమంలో గతేడాది ఫిబ్రవరి 10న హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉందని దుర్గాప్రసాద్‌ను బైక్‌పై తీసుకెళ్లాడు. మార్గమధ్యలో వాహనం ఆపి, బండరాయితో తలపై కొట్టాడు. బలంగా తగలడంతో చనిపోయి ఉంటాడని భావించి, అక్కడి నుంచి పారిపోయాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. రాజేందర్‌రెడ్డి హత్యాయత్నానికి పాల్పడినట్లు నిర్ధారించిన న్యాయస్థానం అయనకు పైశిక్ష విధించింది. కేసు ఛేదనకు కృషిచేసిన పోలీసులను రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అభినందించారు.

ప్రారంభమైన ఎఫ్‌ఐఆర్ నమోదు

- దుద్యాల్ పోలీస్ స్టేషన్ ఏర్పడిన నాలుగు నెలలకు సేవలు ప్రారంభం
- సాక్షి వరుస కథనాలకు స్పందన


మాట్లాడుతున్న ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: ఎట్టకేలకు దుద్యాల్ పోలీస్ స్టేషన్లో సేవలు ప్రారంభమయ్యాయి. కొంత కాలంగా సాక్షి దినపత్రికలో పేరుకే పోలీస్ స్టేషన్, అందుబాటులో లేని సేవలు అని వరుస కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు సేవలను ఇటీవలే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్ఐ యాదగిరి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు సేవలు అందుబాటులో లేకపోవడంతో మండల వాసులను పాత మండల పోలీస్ స్టేషన్‌కే రెఫర్ చేశామన్నారు. ఈ నెల 1వ తేదీన పోలీస్ స్టేషన్‌కు సాంకేతిక సామాగ్రి వచ్చాయని, వాటి ఇన్‌స్టాలేషన్ ప్రాసెస్‌కు సమయం పట్టిందని ఎస్ఐ తెలిపారు.

రెండు రోజుల నుంచి పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సేవలు, కేసుల నమోదు ఇక నుంచి దుద్యాల్ మండల కేంద్రంలోనే ఉంటాయని పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. మండల కేంద్రంలో 16 సీసీ కెమెరాలు ఉండగా, 9 పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. మిగితావి కొంత రిపేర్‌లో ఉన్నాయని త్వరలో వాటిని అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మండల పరిధిలోని చిలుముల మైల్వార్ గ్రామంలో మరో రెండు సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచామని వివరించారు.

సిబ్బంది కొరత..

దుద్యాల్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. స్టేషన్ ప్రారంభించిన నాడు ఎస్ఐతో కలిపి 27 మంది సిబ్బందిని కేటాయించింది. గతంలో కొంత మంది సిబ్బందిని ఇక్కడి నుంచి వేరే స్టేషన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో ఎస్ఐ, ఒక ఏఎస్ఐ, 17 మంది కానిస్టేబుల్ (ఒక మహిళతో కలిపి) అందుబాటులో ఉన్నారు. ఇంకా ఒకరు మహిళ సిబ్బందితో పాటు కొంత మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ విషయమై ఎస్ఐ యాదగిరిని వివరణ కోరగా త్వరలో బదిలీలు చేపట్టే అవకాశం ఉంటుందని, అప్పుడు సిబ్బందిని కేటాయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

వేసవిలో దున్ను.. దిగుబడులకు దన్ను

- లోతైన దుక్కులతో పంటలకు పుష్టి
- తొలకరి వర్షాలకే విత్తనాలు వేసుకునే అవకాశం
- ఏటవాలు సాళ్లతో భూమి కోతకు అడ్డుకట్ట
- వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం


షాబాద్ మండలం మక్తగూడలో దుక్కి దున్నుతున్న కాడెడ్లు

షాబాద్: పంటల సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాని ఏఓ వెంకటేశం తెలిపారు. పలు సందర్భాల్లో రైతులు తీసుకునే సొంత నిర్ణయాలు దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. వేసవి దుక్కులతో కలిగే లాభాలను వివరించారు.

- పంట కొయ్యలను కాల్చకుండా, కలియదున్నాలి.
- వేసవిలో లోతు దుక్కులతో చాలా ప్రయోజనాలున్నాయి.. పురుగులు, తెగుళ్లు, కలుపును నివారించడంతో పాటు భూమి పొరల్లో వర్షపునీరు ఇంకి పంటకు ఉపయోగపడుతుంది.
- ఏప్రిల్, మే నెలలు వేసవి దుక్కులకు అనుకూలం.
- అడ్డం, పొడవు సాళ్లలా కాకుండా ఏటవాలుగా దున్నడం శ్రేయస్కరం.
- ఏటవాలు దుక్కులతో భూమి కోతకు గురికాకుండా ఉంటుంది.
- లోతుగా దున్నినప్పుడు పంటలకు హాని చేసే క్రిమికీటకాలతో పాటు లార్వా దశలో ఉండే గుడ్లు సూర్యకిరణాలు పడి నాశనమవుతాయి.
- తొలకరి వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు వేసుకునే అవకాశం కలుగుతుంది.
- అంతకుముందే రెండుసార్లు దున్నితే గట్టిగా ఉన్న భూమి గుల్లబారుతుంది.
- ఇది కలుపును నియంత్రించడంతో పాటు నేలలో ఎక్కువ కాలం తేమ నిల్వ ఉండేలా దోహదపడుతుంది.
- భూమి పొరల్లోకి గాలి చేరుతుంది.
- సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బన వినియోగం పెరుగుతుంది.
- మొక్క వీటిని నేరుగా గ్రహించే అవకాశం ఉంటుంది.
- కలుపు, పురుగు మందుల అవశేషాలతో మొక్కలకు కీడు కలగకుండా ప్రభావం చూపుతుంది.
- గాలిలో ఉన్న నత్రజని వర్షపు నీటితో కలిసి భూమిలోకి చేరడం వల్ల భూసారం పెరుగుతుంది.
- పురుగుమందులు, తెగుళ్ల మందుకయ్యే పెట్టుబడిని తగ్గించుకోవచ్చు.

ఖైదీల్లో మానసిక పరివర్తన రావాలి

సాక్షి, సిటీబ్యూరో: ఖైదీల సంక్షేమం కోసం తెలంగాణ జైళ్ల శాఖ అమలు చేస్తున్న సంస్కరణలతో ఖైదీలు మానసిక పరివర్తన చెందాలని రాష్ట్ర ప్రభుత్వ హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చర్లపల్లి సెంట్రల్ జైలులో ఏర్పాటుచేసిన ఖైదీల వార్షిక స్పోర్ట్స్ కల్చరల్ మీట్–2025ను శుక్రవారం జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఖైదీల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌కు హాజరు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఖైదీలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రస్తుతం ఉన్న ఫిట్‌నెస్‌ను విడుదల అనంతరం వరకు కూడా కొనసాగించాలన్నారు. జైళ్ల శాఖ అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. జైళ్ల శాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో ఖైదీల్లో క్రమశిక్షణతో పాటుగా మానసిక పరివర్తన సాధ్యమవుతుందన్నారు. అంతేకాకుండా వారి మధ్య స్నేహభావం పెంపొందుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో అవుట్‌డోర్, ఇండోర్ క్రీడలునిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 220 మంది ఖైదీలు మీట్‌లో పాలుపంచుకుంటున్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: నిరుపేదల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్దలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని నాణ్యతతో నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్‌గుప్తా, రాజు, శివలింగం, అందె మోహన్, శ్రీనివాస్, ఖదీర్, శ్రీశైలం, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాలకు వేలం

ఆమనగల్లు: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఈనెల 12న వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ బద్యానాద్‌చౌహాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

డ్రగ్స్‌తో పట్టుబడిన లేడీ డాక్టర్

- నాలుగేళ్లుగా మాదకద్రవ్యాలకు బానిసైన వైనం..
- ఇప్పటి వరకు డ్రగ్స్ కోసం రూ.70 లక్షలు ఖర్చు
- డాక్టర్‌తో పాటు మరొకరి రిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: కొన్నేళ్లుగా డ్రగ్స్‌కు బానిసైన ఓ లేడీ డాక్టర్‌పై టీన్యాబ్ అధికారులు నిఘా ఉంచారు. డ్రగ్ కొనుగోలు చేస్తుండగా రాయదుర్గం పోలీసుల సహాయంతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డెలివరీ బాయ్‌తో పాటు లేడీ డాక్టర్‌ను రిమాండ్‌కు తరలించారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షేక్‌పేట్ యానిమల్ హస్బెండరీ కాలనీలో నివాసం ఉండె చిగురుపాటి నమ్రత (34) ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ముంబైకి చెందిన వంశ్ థక్కర్‌కు వాట్సాప్ కాల్ చేసి కొకైన్ ఆర్డర్ చేసి రూ.5 లక్షలు చెల్లించింది. వంశ్ థక్కర్ కొకైన్ చేరవేసేందుకు ముంబైకి చెందిన బాలకృష్ణ రాంప్యార్ రాం(38)ను హైదరాబాద్‌కు పంపించాడు. గురువారం సాయంత్రం 5.20 గంటల సమయంలో కొకైన్ డెలివరీ చేసేందుకు రాయదుర్గం సర్కిల్‌కు వచ్చాడు. కాల్ చేయగా అక్కడికి వచ్చిన నమ్రత డెలివరీ బాయ్ నుంచి కొకైన్ తీసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 53 గ్రాముల కొకైన్, పది వేల నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. లేడీ డాక్టర్ భర్తకు విడాకులు ఇచ్చిన అనంతరం డగ్స్‌కు అలవాటు పడ్డట్లు తెలుస్తోంది. గత నాలుగేళ్లుగా ఆ డాక్టర్ డ్రగ్స్ కోసం రూ.70 లక్షలు వెచ్చించినట్లు ప్రాథమిక విచారణలో తెలియడంతో పోలీసులు విస్తుపోయారు. ఆమెకు కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ముంబై నుంచి జరిగే కొకైన్ సరఫరాపై దర్యాప్తు కొనసాగుతుందని ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఉపాధ్యాయులు పట్టుదలతో బోధన చేపట్టాలి

- ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు తీసుకురావాలి
- వేసవి శిక్షణ శిబిరంలో చదువుతో పాటు నృత్యం, డ్రాయింగ్, క్రీడలు
- ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ముందస్తు ప్రణాళిక తప్పనిసరి
- ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి రేణకాదేవి సూచన


మాట్లాడుతున్న డీఈవో రేణుక దేవి


శిబిరానికి హాజరైన విద్యార్థులు, గ్రామస్తులు

దుద్యాల్: ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకే ఉన్నత చదువు, అనుభవం ఉంటుందని, నాణ్యమైన విద్య బోధించడంలో వారు ముందుంటారని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. శుక్రవారం దుద్యాల్ మండల పరిధిలోని చిలుముల మైల్వార్ పాఠశాలలో విద్యార్థులకు కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవో విజయరామా రావుతో కలిసి పరిశీలించారు. శిక్షణ శిబిరం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆసక్తి, విద్య, శారీరక సామర్థ్యాలు పెంచే విధంగా తగిన శిక్షణ అందించాలన్నారు. ముఖ్యంగా చదువుతో పాటు నృత్యం, డ్రాయింగ్, క్రీడలు, గణితం సంబంధిత అంశాల్లో మెలకువలు బోధించడంతో పాటు భాషా పరిజ్ఞానం పెంపొందించుకునేలా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సాంకేతికత పెంచేందుకే కృత్రిమ మేదస్సు శిక్షణ

1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ముందస్తుగానే అధునాతన సాంకేతిక పెంచేందుకు కృత్రిమ మేదస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ) శిక్షణ అందిస్తున్నామని డీఈవో రేణుక దేవి తెలిపారు. కృత్రిమ మేదస్సు ద్వారా విద్యార్థులు చదవడం, నేర్చుకోవడం, అర్థం చేసుకోవడం వంటి విధానాలు చాలా వేగంగా నేర్చుకుంటారన్నారు. కంప్యూటర్‌లో ఈ ప్రక్రియ కొనసాగుతుందని, అందుకు సంబంధించి విద్యార్థులకు లాగిన్ ఐడీ ద్వారా ఈ విషయాలు అందుతాయని అన్నారు. చదువుతో పాటు కథలు, తెలుగు, ఇంగ్లీష్, గణిత సంబంధిత అంశాలు కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. కొడంగల్ నియోజకవర్గంలోని 265 పాఠశాలలో కృత్రిమ మేదస్సు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వార్షిక ప్రణాళిక ముందస్తుగానే తయారు చేసుకోవాలి

ప్రతీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు వచ్చే అకాడమిక్ సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళికను ముందస్తుగానే తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏ నెలలో ఏ పాఠ్యాంశం పూర్తి చేయాలి, అందుకు సంబంధించిన పరీక్షను ఎలా నిర్వహించుకోవాలి, అర్థం కాకుంటే విద్యార్థులకు ఎలాంటి వివరణ ఇస్తే బాగుంటాయో వంటి అంశాలను ఉపాధ్యాయుడు రాసుకుని తిరిగి విద్యార్థులకు బోధించాలి. పాఠ్యాంశ బోధనలో నిర్లక్ష్యం తగదని, వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా అకాడమిక్ సంవత్సరం మొదటి నుంచే ప్రణాళికలు తప్పనిసరిగా సిద్ధం చేసుకుంటే ఉత్తమం. అందుకు తగ్గట్టుగా విద్యా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదయ్య, ఉపాధ్యాయులు ఆంజనేయులు, సంగమేశ్వర్, గోవర్ధన్, అనిల్ కుమార్, హన్మంతు, దివ్య శ్రీ, కవిత, గ్రామస్థులు శివ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువులు సేకరణల ప్రదర్శన శనివారం ప్రారంభం కానుంది. సందర్శకులకు ఉచితంగా ప్రవేశం కల్పించే ఈ ఎగ్జిబిషన్ పాతబస్తీ ఉర్దూ ఘర్‌లో ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది. అరుదైన నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌ల ప్రదర్శన, చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 7వ శతాబ్దం నాటి అంతర్జాతీయ నాణేలు, కరెన్సీని ప్రదర్శించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రి తెలిపారు. నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌లతో పాటు ఇతర పురాతన వస్తువుల మిశ్రమ కలయిక గల వస్తువులను ఈ ఎగ్జిబిషన్లో సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మరిన్ని వివరాల కోసం సొసైటీ కార్యదర్శి లేదా డైరెక్టర్ సిరాజుద్దీన్‌లను 8500212306 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కళాకారులను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి సుబ్బారావు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి కళా సుబ్బారావు అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీత్యాగరాయ గానసభలో కళా సుబ్బారావు జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంట నగరాల్లో ప్రసిద్ధి పొందిన గానసభకు ఆజ్యంపోసిన వ్యక్తిగా, సుదీర్ఘకాలం పాటు అధ్యక్షుడిగా పనిచేసి ఎంతో మంది కళాకారులకు తమ కళను ప్రదర్శించే వేదికను అందించిన గొప్ప వ్యక్తిగా సుబ్బారావు కీర్తి గడించారని పేర్కొన్నారు. అనంతరం బద్ధం కళా సుబ్బారావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎం.కె రాముకు బహూకరించారు.

సేవా దాహం

- మండు వేసవిలో జనం దప్పిక తీరుస్తున్న దాతలు
- తాండూరు, వికారాబాద్‌లో మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ
- సామాజిక సేవలో ముందున్న మార్వాడీ యువమంచ్



తాండూరులో బాటసారులకు మజ్జిగ అందజేస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

తాండూరు టౌన్: సామాజిక సేవే లక్ష్యంగా తాండూరులోని మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా వేసవి కాలంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. నిత్యం 1,200 చల్ల అందజేస్తున్నారు. 30 ఏళ్లుగా తాండూరు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి జనం దప్పిక తీరుస్తున్నారు. మానవ సేవే మాధవ సేవ అని భావించి తమ సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మన్మోహన్‌సార్డా, తాండూరు అధ్యక్షుడు అనిల్‌కుమార్ సార్డా, ప్రధాన కార్యదర్శి సచిన్‌రాఠీ తెలిపారు.

కృష్ణపంతులు ఔదార్యం

అనంతగిరి: వికారాబాద్‌లోని శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేసి బాటసారులు, ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. ఆలయ అర్చకుడు కృష్ణ పంతులు సౌజన్యంతో రైల్వే స్టేషన్ రోడ్‌లోని రామ మందిర్ ఎదురుగా స్వచ్ఛమైన తాగునీరు అందజేస్తున్నారు. పదిహేను సంవత్సరాలుగా ప్రతీ వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్నారు.


రామమందిరం ఎదుట కృష్ణ పంతులు ఏర్పాటు చేసిన చలివేంద్రం

సందీపుడి సేవాగుణం

వికారాబాద్‌లోని ఆలంపల్లి ప్రధాన రోడ్డులో సందీప్ మెడికల్ షాప్ నిర్వాహకులు మూడేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి జనం గొంతు తడుపుతున్నారు. తన దుకాణం ఎదురుగా సందీప్ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బాటసారులకు మినరల్ వాటర్ అందిస్తున్నారు. నిత్యం వందలాది మంది ఇక్కడ దాహం తీర్చుకోవడం సంతోషం కలిగిస్తోందని చెబుతున్నారు.


మంచినీళ్లు అందజేస్తున్న సందీప్‌కుమార్